క్లుప్తంగా

13న చలో హైదరాబాద్



డిచ్‌పల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 13న 'చలో హైదరాబాద్' కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు టీయూసీఐ జిల్లా నాయకుడు మురళి తెలిపారు. మండలంలోని ఘన్‌పూర్, గొల్లపల్లి, అమృతాపూర్, నడిపల్లి, ధర్మారం(బి) గ్రామాల పంచాయతీ కార్మికులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. మురళి మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు ప్రభుత్వ గ్రాంట్ ద్వారా వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 13న హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు జీపీ కార్మికులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్మికులు రమేష్, నవీన్, సాయిలు, సుశీల, నర్సయ్య, సాయికిరణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

నిజామాబాద్ రూరల్: విజయవాడలో ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించనున్న భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పెద్ది సూరి పిలుపునిచ్చారు. నగర శివారులోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. మహాసభల్లో విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేతులమీదుగా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారని తెలియజేశారు. నాయకులు వేణుగోపాల్, మారుతి, విష్ణు, విశాల్, భీమ్ రావు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఓమయ్య, గౌరవ అధ్యక్షురాలిగా బైరి సాయమ్మ, జిల్లా అధ్యక్షురాలిగా స్రవంతి, జిల్లా ఉపాధ్యక్షురాలుగా నాగలక్ష్మి, గంగామణి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చక్రపాణి, గంగాధర్, జిల్లా కార్యదర్శిగా సబిత, ఉమ, జిల్లా కోశాధికారిగా బాల్‌రాజు, సభ్యులుగా 25మందిని నియమించారు.మధ్యాహ్న భోజన కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.అనంతరం పలు అంశాలపై చర్చించి, తీర్మానాలు చేసినట్లు ఓమయ్య తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలు పాటించకుండా సెల్లార్‌లలో వ్యాపారం నిర్వహిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి నాయకులు కోరారు. ఈమేరకు వారు సోమవారం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో 119 అక్రమ నిర్మాణాలున్నట్లు గుర్తించామన్నారు. వారికి అధికారులు వెంటనే నోటీసులు పంపాలని కోరారు. నాయకులు అనిల్ కుమార్, ప్రవీణ్, వర్మ, శ్రీనివాస్, రత్నాకర్, దేవేషలు కోరారు.

18న రైతు ధర్నా



నిజామాబాద్ సిటీ: రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 18న రైతు ధర్నాను నిర్వహిస్తున్నట్లు ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరు భూమయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. ధర్నాకు రైతులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు సాయి రెడ్డి, సాయిలు, అగ్గు ఎర్రన్న, బాబురావు, బుచ్చన్న, గంగారం, గంగాధర్ పాల్గొన్నారు.

ఆటంకాలు కలిగించొద్దు



నిజామాబాద్ సిటీ: ఆశ కార్యకర్తల వేతనాల పెంపు కోసం తలపెట్టిన 'ఛలో హైదరాబాద్' కార్యక్రమానికి అధికారులు ఆటంకాలు కలిగించవద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో డీఎంహెచ్‌వో, అదనపు కలెక్టర్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశలను వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించాలన్నారు. సుకన్య, లలిత, శోభ, గంగామణి, రేణుక, బాలమణి, రమ, సంగీత, రేవతి, సాహెరా, రాధా, రేణుక ఉన్నారు.

ముగిసిన ప్రజాపాలన విజయోత్సవాలు



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది, కార్మికులు

- నగరంలో మున్సిపల్ సిబ్బంది ర్యాలీ

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నగర మున్సిపల్‌లో చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాలు సోమవారం ముగిశాయి. తొమ్మిది రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించగా, ముగింపు రోజున మున్సిపల్ సిబ్బంది నగరంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్, అడిషనల్ కమిషనర్ ఎస్.శంకర్‌లు ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా సాగాలన్నారు. కేవలం ఉత్సవాల సమయంలో కాకుండా యథావిధిగా పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని సూచించారు. విధులు సక్రమంగా నిర్వహించిన వారిని ప్రోత్సహిస్తూనే, సక్రమంగ చేయని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సిబ్బంది, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈఈ మురళీకృష్ణరెడ్డి, మేనేజర్ జనార్దన్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి



తెయూలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఇక్కడ యూనివర్సిటీ ఉండి కూడా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనమని విమర్శించారు. తెయూ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే నాలుగు జిల్లాల విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో మాట్లాడి, జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. నాయకులు అక్షయ్, నిఖిల్, బిందు, రాకేశ్, రాజేందర్, రవీందర్, బీమేశ్, కార్తీక్, శ్రీజ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నిజామాబాద్ రూరల్: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక తాజా మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం బిల్లులను చెల్లించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్కటి వెంకటేష్ అన్నారు. మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టులను ఖండించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించి, సర్పంచులను ఇబ్బంది పెట్టకుండా ఆదుకోవాలని కోరారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



సిరికొండలో అరెస్ట్ అయిన మాజీ సర్పంచ్‌లు

సిరికొండ: మంలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. వారు హైదరాబాద్‌కు వెళ్లకుండా పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్ సిటీ: ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. ఈమేరకు సోమవారం వారు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలన్నారు. నాయకులు నరసయ్య, రాములు, హైమావతి, సరోజ, పుష్పలత, భూలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17 న నిర్వహించే ధర్నాను విజవంతం చేయాలని అఖిల భారతీయ రాష్ట్రీయ మహ సంఘ్ బాధ్యులు వెంకట్రావ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మట్లాడారు. ఉపాధ్యాయులు పెండింగ్ బిల్లులను సత్వరమే ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రతినిధులు కృష్ణవేణి, బద్రీనాద్, రామకృష్ణరెడ్డి, సుదర్శన్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం సరికాదు

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సరికాదని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో కొన్ని నెలల పాటు కవులు, కళాకారులు, మేధావులు, పండితులతో చర్చించి కేసీఆర్ మన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపకల్పన చేయించారన్నారు. అలాంటి విగ్రహాన్ని మార్చడం సరికాదన్నారు. నాయకులు సత్యప్రకాష్, నీలగిరి రాజు, తెలంగాణ శంకర్, శేఖర్ రాజు, కరిపె రాజు, ఫాయిం ఖురేషి, మీసాల శంకర్, భూపతి, మల్లేశం, విజయ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల కోసం స్పెషల్‌డ్రైవ్



నిజామాబాద్ సిటీ: నగర కార్పొరేషన్ పరిధిలో సోమవారం పన్నుల వసూళ్ల కోసం అధికారులు స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ అధికారులతో కలిసి పన్నులను వసూలు చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని పలు వ్యాపార, వాణిజ్య సముదాయాలను పరిశీలించారు. బస్టాండ్ రోడ్డులోని కవిత కాంప్లెక్స్‌లో వాణిజ్య సముదాయాన్ని పరిశీలించారు. కమర్షియల్ గదులను పరిశీలించారు. కాంప్లెక్స్ పరిధిని కొలతలు తీసుకున్నారు. రెవెన్యూ ఆఫీసర్ నజీర్, బిల్ కలెక్టర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తం

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక



సిరికొండ: తపాలా శాఖ ఆధ్వర్యంలో అందించే దీన్ దయాళ్ స్పర్శ్ యోజన జాతీయ ఉపకార వేతనానికి సిరికొండ సత్యశోధక్ పాఠశాల విద్యార్థి సిద్దార్థ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. ఈసందర్భంగా సోమవారం సిద్దార్థ్‌ను పాఠశాలలో వారు అభినందించారు.

యూత్ కాంగ్రెస్ నాయకులకు సన్మానం



సిరికొండ: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రవీణ్‌ను, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రామును పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, దేవరాజు, సంతోష్, ఆసిఫ్, రాజేందర్‌గౌడ్, లియాఖత్ అలీ, భాస్కర్‌రెడ్డి, రమేష్, దిగంబర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

ఇందల్వాయి: జగిత్యాల జిల్లాలో ఇటీవల జరిగిన



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ఇందల్వాయి ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. విద్యార్థులు పల్లవి, గంగోత్రి, శ్రీవిద్య పోటీల్లో మూడోస్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు కోరారు. ఈమేరకు ఆయన సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ కార్మికులు, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని చందన జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా సోమవారం విద్యార్థినిని హెచ్ఎం సురేందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా సోనియా జన్మదినం



డిచ్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సిరికొండలో కేక్ కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు

సాక్షినెట్‌వర్క్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదినాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో పార్టీ నాయకులు కేక్‌లు కట్ చేసి, సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. పలు గ్రామాల్లో అన్నదానం, చిన్నారులకు, రోగులకు పండ్ల పంపిణీ వంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన సోనియాగాంధీ పుట్టినరోజునే చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం విద్యార్థుల బలిదానాలు కావద్దని తెలంగాణ రాష్ట్రం ఇచ్చి, పేద, మధ్య తరగతుల వారి కోసం పాటుపడ్డారని కొనియాడారు.



ధర్పల్లిలో..



నగరంలో టీపీసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో..

నేటి చిత్రం



నగరంలోని తహసీల్, ఆర్డీవో కార్యాలయాల ఆవరణలో బైక్‌లు..

పార్కింగ్ స్థలాలా?



నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పాత మున్సిపల్ కార్యాలయం, సౌత్, నార్త్ తహసీల్ కార్యాలయాలు, ఆర్‌డీవో కార్యాలయాలు పార్కింగ్ స్థలాలుగా మారుతున్నాయి. ఆర్మూర్, నిర్మల్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రదేశాలకు వెళ్లే వారు తమ వాహనాలను ఆయా కార్యాలయాల ఆవరణలోనే పార్కింగ్‌చేసి వెళ్లిపోతున్నారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలా? పార్కింగ్ ప్రదేశాలా అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో వాహనాలను నిలపకుండ చూడాలని ప్రజలు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి



ధర్పల్లిలో ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



ఇందల్వాయిలో..

ధర్పల్లి/ఇందల్వాయి: జీపీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించి, దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు రెబ్బ సుమన్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. సుమన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా కార్యదర్శుల సమస్యలను పరిష్కరించకపోవడం శోచనీయమని అన్నారు. కార్యదర్శులు తీవ్రమైన పని భారంతో ఆర్థికంగా, మానసికంగా కృంగిపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే ఇందల్వాయిలో పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో లక్ష్మారెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సాయికుమార్, జయమ్మ, దిలీప్ , శ్రీనివాస్, లావణ్య, శ్వేత, మహేష్, శ్రీధర్, సువార్తా, అశోక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

'సీఎం కప్' ఏర్పాట్ల పరిశీలన



నిజామాబాద్ రూరల్: మోపాల్‌లో నేటి నుంచి నిర్వహించనున్న సీఎం కప్ క్రీడాపోటీల ఏర్పాట్లను సోమవారం ఎంపీడీవో రాములు నాయక్ పరిశీలించారు. ఎంపీవో కిరణ్ కుమార్, ఎంఈవో గేమ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్ పోటీలు

జక్రాన్‌పల్లి: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నేటి నుంచి సీఎం కప్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సతీష్‌కుమార్ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రూ.4వేల జీవన భృతి ఇవ్వాలి

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు రూ.4016 జీవనభృతి అందించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆర్మూర్‌లో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమ దెబ్బతినే విధంగా చట్టాలు తీసుకురావడంతో అనేక బీడీ పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. ప్రస్తుతం బీడీ కంపెనీలలో కార్మికులకు సరిపడ పని దొరకడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన బీడీ కార్మికులను జీవనభృతి ఇవ్వాలన్నారు. అలాగే రుద్రూర్‌లో టీయూసీఐ ఆధ్వర్యంలో బీడీకార్మికులు ధర్నా నిర్వహించారు. నాయకులు మల్లేష్, నజీర్, సుజాత ఉన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,700	వెండి(కిలో)	95,000
22 క్యారెట్స్	72,612		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	50	70
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	40
బీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	35	60	ఆలుగడ్డ	35	50
బీర్నిసుకాయ	35	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	30	60	గోబిపువ్వు	50	90
వంకాయ	10	20	బీట్‌రూట్	50	90
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	35	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	25	50
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.15, 2.00,6.00,10.00
స్క్రీన్-2	పుష్ప-2(తెలుగు)-1.00,4.45,9.10
స్క్రీన్-3	పుష్ప-2-11.00,3.10,7.00,10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.15 2.20 6.25,10.30
స్క్రీన్-2	పుష్ప-2(తెలుగు)-9.30,1.35, .5.40, 9.45
స్క్రీన్-3	పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10, 10.15
స్క్రీన్ -4	పుష్ప-2(తెలుగు)-9.45,1.50, 5.55, 10.20
లలితామహల్	కేసీఆర్(తెలుగు)
దేవి	పుష్ప-2(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామంలోగల శ్రీభూనీలా వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో సోమవారం అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి బాల్యపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.